సబర్మతి నది ప్రక్షాళన అయినప్పుడు

'మూసీ' ఎందుకు జరగొద్దు ?

- పేదలు ఎప్పుడూ మూసీ మురికికూపంలోనే ఉండాలా..?
- పదేళ్ల బిఆర్ఎస్ దోపిడీ బైటపడుతుందనే నాటకాలు
- నిర్వాసితులను ఎలా ఆదుకోవాలో చెప్పండి..
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"సబర్మతి నది ప్రక్షాళన జరిగినప్పుడు మూసీ నది ప్రక్షాళన ఎందుకు జరగొద్దు..తెలంగాణ నుంచి వేల కోట్లు పన్నులు కేంద్రానికి చెల్లిస్తున్నాం.మూసీ ప్రక్షాళనకు ప్రధాని మోడీ ఎందుకు సహకరించరు..? రేపు ఢిల్లీ వెళ్లి ప్రధానిని కలుస్తాం. బిజెపి ఎంపి ఈటల కూడా కలిసిరావాలి. బిఆర్ఎస్ నాయకులు అన్న మాటలే ఈటల మాట్లాడుతున్నారు.మూసీ ప్రక్షాళన చేసి తీరతాం. ప్రజలు నిరాశ్రయులు అవుతారని ప్రాజెక్టులు కట్టకుండా ఉంటారా? మల్లన్నసాగర్, కొండపోచమ్మ, గంధమల్లు రిజర్వాయర్ల నిర్మాణం వల్ల ఎవరి భూములూ పోలేదా? మల్లన్నసాగర్ పేరుతో రైతులను బలవంతంగా ఖాళీ చేయించారు. మూసీ నిర్వాసితులకు మంచి స్థలంలో ఆశ్రయం కల్పిస్తాం. వారిని ఎలా ఆదుకోవాలో సూచనలివ్వండి. గత పదేళ్ల దోపిడీ బైట పడుతుందనే బిఆర్ఎస్ నాయకులు నాటకాలాడుతున్నారు. బిఆర్ఎస్ పార్టీ నిధులు పదేళ్లలో రూ.1500 కోట్లు దాటాయి. 2014కు ముందు ఉన్నదెంత.. ఇప్పుడెంత? ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా మూసీ ప్రక్షాళన చేసితీరతాం" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ శిల్పకళా వేదికలో ఆదివారం ఏర్పాటు చేసిన 'కొలువుల పండుగ' కార్యక్రమంలో సిఎం పాల్గొని ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికైన 1,635 మందికి నియామక పత్రాలు అందజేశారు. వివిధశాఖల్లో ఉద్యోగాలు పొందిన వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ పునర్నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఇంజనీర్ల కృషి గొప్పతనం ఈ సమాజానికి చాలా అవసరమన్నారు. 360 కి.మీ రీజినల్ రింగ్ రోడ్డు, రేడియల్ రోడ్స్ మీ చేతుల మీదుగా నిర్మాణం కాబోతున్నాయి. ఎయిర్‌పోర్టుకు కూతవేటు దూరంలో ఫ్యూచర్ సిటీ, ఫార్మాసిటీ నిర్మాణం కాబోతున్నాయి. 55 కి.మీ మూసీ రివర్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు పూర్తి చేసి దేశానికి ఆదర్శంగా నిలబెడతామని చెప్పారు.

మార్పు రావాలి, కాంగ్రెస్ గెలవాలన్న ఆలోచనతో ఆనాడు చేపట్టిన 'విద్యార్థి నిరుద్యోగ జంగ్ సైరన్'కు మీరంతా మద్దతిచ్చారని సిఎం గుర్తుచేశారు. కేసీఆర్, ఆయన కుటుంబంలోని వారి ఉద్యోగాలు పోతేనే పేదలకు ఉద్యోగాలు వస్తాయని ఆనాడు చెప్పాను. నేను చెప్పినట్టే కేసీఆర్ ఉద్యోగం పోయింది.. ఇప్పుడు పేదలకు ఉద్యోగాలు వస్తున్నాయి. కొన్ని సంవత్సరాల నుంచి నియామకాలు జరగక, ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేక, లక్షలాది మంది నిరుద్యోగ యువకులు నిరాశచెందారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆలోచన చేసి సంవత్సరాల కొద్దీ వాయిదా పడుతున్న ప్రభుత్వ ఉద్యోగాలకు పరిష్కారం చూపించింది. 90 రోజుల్లోనే 30వేల ఉద్యోగాలు ఇచ్చి వారి తల్లిదండ్రుల కళ్లల్లో ఆనందం చూసే విధంగా చేశాం. ఈనెల 9న సాయంత్రం 4గంటలకు ఎల్బీస్టేడియంలో 11,063 టీచర్ల ఉద్యోగ నియామక పత్రాలు అందించబోతున్నామని తెలిపారు. వందేళ్ల అనుభవం ఒకవైపు ఉంటే.. పదేళ్ల

దుర్మార్గం ఒకవైపు ఉందని చెప్పారు. తెలంగాణ ఉద్యమం అనే ముసుగు వల్ల కేసీఆర్ ఎన్నో ఏళ్లు గౌరవం పొందారు. మొన్నటి వరకు ఆయన పొందిన గౌరవం తెలంగాణ ఉద్యమం ఘనతే తప్ప ఆయన గొప్పతనం కాదని రేవంత్‌రెడ్డి విమర్శించారు.

నదుల పేర్లను ఎంతోమంది తమ పిల్లలకు పెట్టారు. చాలా మందికి గంగ, యమున, కావేరి పేర్లు ఉంటాయి. మూసీ పేరును ఏ తండ్రి అయినా తమ కుమార్తెకు పెట్టుకున్నారా? మూసీ అంటే మురికి కూపమనే పేరు స్థిరపడింది. మూసీ పరివాహక ప్రజలు దశాబ్దాలుగా మురికిలోనే ఉండాలా? మూసీ పరివాహక ప్రాంతంలో ఆరు నెలలుగా ఇంటింటికి తిరిగి 33 బృందాలు సర్వే చేశాయి. 10వేల కుటుంబాలు నిరాశ్రయులవుతున్నాయి. వారిని ఆదుకుంటాం. ఏవిధంగా సహాయం చేయాలో ప్రతిపక్షాలు సూచనలివ్వండి అని ముఖ్యమంత్రి కోరారు. కార్యక్రమంలో మంత్రులు తుమ్మల, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి,పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, సీతక్క సిఎస్ శాంతికుమారి, ప్రభుత్వ సలహాదారులు కెకె, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికైనవారికి నియామక పత్రాలు అందజేస్తున్న సిఎం

యువతి హత్య కేసు ఛేదించిన పోలీసులు

- నిందిమరాలు అరెస్ట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ కూకట్‌పల్లిలోని లోధా అపార్టుమెంట్ సమీపంలోని నిర్మానుష్య ప్రదేశంలో గత బుధవారం హత్యకు గురైన ప్రియాంక కేసును కూకట్‌పల్లి పోలీసులు ఛేదించారు. యువతిని హత్య చేసి పోలీసులను తప్పుదోవ పట్టించేందుకు లైంగికదాడి, హత్య జరిగినట్టు సృష్టించిన హంతకురాలు మంజులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఆదివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి డిసిపి సురేష్ కుమార్ వివరాలు వెల్లడించారు. కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని భాగ్యనగర్ కాలనీ ప్రాంతంలో నివసించే నిజామాబాద్ జిల్లా బోధన్‌కు చెందిన ప్రియాంకకు ఎల్లమ్మబండ, ఎన్‌టిఆర్ నగర్ ప్రాంతానికి నివసించే మంజులతో స్నేహం ఏర్పడింది. ఈ క్రమంలో ప్రియాంక.. తన దగ్గర ఉన్న చెవి పోగులు, వెండి ఆభరణాలను మంజుల దగ్గర దాచి పెట్టింది. గత నెల 30న తన బంగారు, వెండి వస్తువులు ఇవ్వాలని మంజులను కోరగా, అందుకు ఆమె నిరాకరించింది. ప్రియాంక.. తనకు తెలిసిన వారితో మంజులను బెదిరించి తన బంగారు చెవి పోగులు, వెండి అభరణాలను తీసుకున్నది. దాంతో ప్రియాంకతో తనకు ప్రాణహాని ఉందని గుర్తించిన మంజుల, ప్రియాంకను తన ఇంటికి తీసుకువెళ్లి బాగా మద్యం తాగించింది. అనంతరం ప్రియాంకను స్కూటీ పైన కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని లోధా అపార్టుమెంట్ ముందున్న ఉదాశీన్ మఠం ఖాళీ స్థలంలోని చెత్తకుప్పలో పడవేసి తన వెంట తెచ్చుకున్న బ్లేడ్‌తో గొంతు కోసి హత్య చేసింది. నేరం తన మీదికి రాకుండా ప్రియాంకపై లైంగికదాడి చేసి హత్య చేశారని నమ్మించడానికి, ప్రియాంక బట్టలు మొత్తం చింపి.. అక్కడి నుంచి పరారైంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. సీసీ ఫుటేజ్ ఆధారంగా నిందితురాలు మంజులను అదుపులోకి తీసుకొని విచారించగా, నేరం తానే చేసినట్టు అంగీకరించింది. దాంతో ఆమెను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు డిసిపి తెలిపారు.

9న ఉపాధ్యాయ నియామక పత్రాలు అందజేత

- సిఎస్ శాంతి కుమారి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయ అభ్యర్థులకు ఈనెల 9న హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలను అందిస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తెలిపారు. బుధవారం సాయంత్రం 4 గంటలకు జరిగే ఈ కార్యక్రమ ఏర్పాట్లపై ఆమె సంబంధిత కార్యదర్శులు, జిల్లా కలెక్టర్లతో ఆదివారం టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు ఈ సందర్భంగా సిఎస్ శాంతకుమారి మాట్లాడుతూ దాదాపు 10 వేలకుపైగా ఉపాధ్యాయ అభ్యర్థులకు ఈ నియామక పత్రాలను జారీ చేస్తున్నట్టు తెలిపారు. ఎంపికైన ఉపాధ్యాయ అభ్యర్థుల కు సంబంధించి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియను సంబంధిత జిల్లా కలెక్టర్లు పూర్తి చేశారనీ, సోమవారం సాయంత్రంలోగా తుది జాబితాను పాఠశాల విద్యా కమిషనర్ సంబంధిత జిల్లా కలెక్టర్లకు అందజేస్తారని తెలిపారు. ఈనెల 9న ఎంపికైన ఉపాధ్యాయ అభ్యర్థులందరినీ మధ్యాహ్నం రెండు గంటల లోపే ఎల్.బి.స్టేడియానికి చేరేలా తగు ప్రణాళిక రూపొందించుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు. ఎంపికైన ఉపాధ్యాయ అభ్యర్థులను హైదరాబాదుకు చేరవేయడానికి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయడంతో పాటు ప్రతి బస్సులో ఒక పోలీస్ కానిస్టేబుల్, సమన్వయ అధికారిని నియమించాలని సూచించారు. జిల్లా నుంచి వచ్చే బస్సులను వేదికకు సమీపంలోనే తగు పార్కింగ్ సదుపాయాన్ని ఏర్పాటు చేయడంతో పాటు అభ్యర్థులను స్టేడియం సమీపంలోనే దించే విధంగా చర్యలు చేపట్టాలని నగర పోలీస్ కమిషనర్‌కు సూచించారు. నగరంలో వర్షం వచ్చే అవకాశం ఉన్నందున రేయిన్ ప్రూఫ్ షామియానాను వేయాలని ఆదేశించారు. ఈ ఉపాధ్యాయ నియామక పత్రాలు అందజేసే కార్యక్రమానికి అభ్యర్థులతో పాటు వారి కుటుంబ సభ్యులు కూడా వచ్చే అవకాశం ఉన్నందున తగు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. స్టేడియంలో అభ్యర్థులకు నియామక పత్రాలు అంద చేసేందుకుగాను జిల్లాల వారీగా ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ టెలి కాన్ఫరెన్స్‌లో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశం, హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, అడిషనల్ డీజీ మహేష్ భగవత్, రోడ్లు భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శి హరిచందన, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వెంకట నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'నేవీ రాడార్' ను అడ్డుకుంటాం

- 'సేవ్ దామగుండం' పేరిట బతుకమ్మ సంబురాలు

ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో

నేవీ రాడర్ స్టేషన్ ఏర్పాటు చేసి మూడు నదులు పుట్టుక నేలను ఎడారిగా మార్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర చేస్తున్నాయని అరుణోదయ సాంస్కతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క ఆరోపించారు. ఆదివారం పూడూరు మండల పరిధిలోని దామగుండం అటవీ ప్రాంతంలో బహుజన బతుకమ్మ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బతుకమ్మ సంబరాల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని బతుకమ్మను పేర్చి వేడుకల్లో ఆడిపాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఈసీ, మూసీ, కాగ్నా నది పుట్టకతోనే హైదరాబాద్ సస్యశ్యామలంగా ఉందని అన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం నేవీ రాడార్ కేంద్ర ఇక్కడ ఏర్పాటు చేయడంతో ఇక్కడ ఉన్న 12లక్షల చెట్లతోపాటు జీవనదులు, వన్యప్రాణులు అన్ని నశించిపోయే ప్రమాదం ఉందన్నారు. రూ.వంద కోట్లు కేటాయించి మూసీ నదిని ప్రక్షాళన చేసి హైదరాబాద్‌కు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని డిమాండ్ చేశారు. నేవీరాడర్ ఏర్పాటు ఆలోచన ను విరమించుకోకపోతే ఉద్యమాన్ని ఉధతం చేస్తామని హెచ్చరించారు. ఈ ప్రాంతంలో నేవీ ప్రాజెక్టు కాకుండా రీసెర్చ్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలన్నారు.

దేశానికి రోల్ మోడల్‌గా కొత్త రెవెన్యూ చట్టం

- యాచారం, తిరుమలగిరిల్లో ప్రయోగాత్మకంగా అమలు
- త్వరలో రెవెన్యూ యంత్రాంగం పునరుద్ధరణ
- డిప్యూటీ కలెక్టర్ ముఖాముఖిలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశానికి రోల్ మోడల్‌గా ఉండేలా 'తెలంగాణ రెవెన్యూ చట్టం-2024ను తీసుకురాబోతున్నామని రాష్ట్ర రెవెన్యూ, శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. స్పెష ల్‌గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లు, డిప్యూటీ కల్లెక్టర్లతో ఆదివారం హైదరాబాద్‌లోని ఎంసిఆర్‌హెచ్‌ఆర్‌డిలో ముఖాముఖి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోనే విధంగా రెవెన్యూ వ్యవస్థను ప్రక్షాళన చేసి సామాన్యునికి అందుబాటులోకి తీసుకొస్తామని పేర్కొన్నారు. కొత్త రెవెన్యూ చట్టం రాకముందే ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక రెవెన్యూ అధికారిని నియమిస్తామని చెప్పారు. నల్లగొండ జిల్లా తిరుమలగిరి, రంగారెడ్డి జిల్లా యాచారం మండలాల్లో పైలట్ ప్రాజెక్ట్ చేపట్టామనీ, అక్కడ ఎదురయ్యే సమస్యలను పరిగణనలోకి తీసుకుని కొత్త చట్టాన్ని రూపొందిస్తున్నామని తెలిపారు. ధరణి పోర్టల్, ఆర్వోఆర్ చట్టం-2020 వల్ల సామాన్య ప్రజలు, రైతులు ఇబ్బందులకు గురయ్యారని అన్నారు. ఒక్క తిరుమలగిరి మండలంలో 4,380 ఎకరాల్లో సర్వే నిర్వహిస్తే 1,300 ఎకరాల్లో మోఖా మీద లేని వారికి పాసు బుక్కులు ఉన్నాయనే విషయం బహిర్గతమయిందని వివరించారు. ప్రభుత్వ భూముల పరిరక్షణలో ఏ మాత్రం రాజీ పడొద్దని వారికి సూచించారు. వాటి పరిరక్షణ కోసం రికార్డుల డిజిటలైజేషన్ చేపట్టనున్నట్టు వెల్లడించారు. రెవెన్యూ ఉద్యోగులకు సంబంధించి జాబ్ చార్ట్ రూపొందించాలనీ, ఇందుకోసం ఒక కమిటీని ఏర్పాటు చేసి ఇతర రాష్ట్రాల్లో అధ్యయనం చేయాలని ఆదేశించారు. ఉద్యోగుల సమస్యలకు సంబంధించి ఆర్థికేతర అంశాలను తక్షణమే పరిష్కరించనున్నట్టు తెలిపారు. 33 జిల్లాల్లోని సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ పోస్టులను సృష్టిస్తామని పేర్కొన్నారు. అలాగే 17 మంది రెవెన్యూ అధికారులకు ఐఏఎస్ హోదా కల్పించడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎన్నికల సమయంలో బదిలీ అయిన తహసిల్దార్లను పూర్వ స్థానాలకు బదిలీ చేయడానికి దసరాలోపే నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. మండలాలు, రెవెన్యూ డివిజన్లు, జిల్లాలను పెంచిన గత ప్రభుత్వం మౌళిక సదుపాయాలను విస్మరించిందన్నారు. రెవిన్యూ శాఖ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ మాట్లాడుతూ గత తొమ్మిది నెలల్లో దాదాపు 3.50 లక్షల ధరణి దరఖాస్తులను పరిష్కరించడం జరిగిందన్నారు. సమావేశంలో హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురుశెట్టి, డిప్యూటీ కల్లెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వి. లచ్చిరెడ్డి, కె. చంద్రమోహన్, ట్రెసా అధ్యక్షులు వంగ రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గౌతమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్ల వ్యవస్థను దుర్వినియోగం చేస్తున్న బిజెపి

- సిపిఎం ఎంపి జాన్ బ్రిటాస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గవర్నర్లను స్వతంత్రంగా వ్యవహరించకుండా బిజెపి దుర్వినియోగం చేస్తున్నదని సిపిఎం రాజ్యసభ సభ్యులు జాన్ బ్రిటాస్ విమర్శించారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మలయాళీ తెలంగాణ అసోసియేషన్ ఆధ్వర్యంలో కేరళ కామ్రేడ్స్ ఆయన సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో సిపిఎం హైదరాబాద్ సిటీ సెంట్రల్ జిల్లా కమిటీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేరళలో ప్రజలు ఎన్నుకున్న అక్కడి వామపక్ష ప్రభుత్వాన్ని పాలన చేయకుండా గవర్నర్ ద్వారా ఇబ్బందులు పెడుతున్నదని తెలిపారు. ఆ గవర్నర్ యూనివర్సిటీలకు వైస్ ఛాన్సలర్లను నియమించకుండా ప్రభుత్వ సిఫారసులను పెండింగ్‌లో పెడుతూ ఇబ్బంది పెడుతున్నారని చెప్పారు. బిజెపికి రామునిపై భక్తి కన్నా తమ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడమే తెలుసని విమర్శించారు. అధికార బిజెపికి భయపడకుండా ప్రతి సందర్భంలో ప్రతి అంశంలో నికరంగా నిలబడి సమాధానిస్తున్నట్టు తెలిపారు. ఉత్తర్‌ప్రదేశ్, బీహార్ ప్రాంతాలకు చెందిన వారిని ఓటర్లుగా చేర్చడం, కాంగ్రెస్ సిట్టింగ్ ఎంపీని మార్చి బలహీనమైన అభ్యర్థిని నిలబెట్టడం ద్వారా కేరళలో బిజెపి ఒక ఎంపి సీటు గెలుచుకుందని తెలిపారు. బిజెపి తప్పులను ప్రశ్నించకుండా మెజార్టీ మీడియా మౌనంగా ఉండిపోయిందనీ, సోషల్ మీడియాలో అనేక తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారని తెలిపారు. పార్టీ కార్యకర్తలు ఎప్పటికప్పుడు తప్పుడు ప్రచారాన్ని తిప్పికొడుతూ, బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కేరళ కామ్రేడ్స్ కో ఆర్డినేషన్ కన్వీనర్లు రాధాకృష్ణ, సంతోష్, కోర్ కమిటీ సభ్యులు కె.డి.ఉదయన్, కె.డి.దేవరాజన్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

అమెరికా పర్యటనకు మంత్రి జూపల్లి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదివారం అమెరికాకు వెళ్లనున్నారు. ఐమ్యాక్స్ అమెరికా 2024 పేరిట లాస్ వేగాస్‌లో నిర్వహించనున్న అతి పెద్ద వాణిజ్య ప్రదర్శనలో మంత్రి పాల్గొంటారు. ఆదివారం దుబాయ్ నుంచి అమెరికా వెళ్లారు. నేడు వాషింగ్టన్ డీసీ చేరుకుంటారు. మంగళవారం లాస్ ఎంజెల్స్, 9,10న లాస్ వెగాస్, 11న అట్లాంటాలో నిర్వహించే వివిధ కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారు. అమెరికా పర్యటన ముగించుకుని12న భారత్ చేరుకొంటారు. తెలంగాణ పర్యాటక రంగానికి కలిసి వచ్చే అంశాలను సద్వినియోగం చేసుకుంటూ దాన్ని కొత్తపుంతలు తొక్కించడం, ప్రభుత్వ, ప్రయివేటు భాగస్వామ్యంలో పర్యాటక రంగంలో భారీ పెట్టుబడులే లక్ష్యంగా మంత్రి జూపల్లి కృష్ణారావు పర్యటన కొనసాగనుంది.

అన్నదాతల బలిదానాలకు రేవంత్ సర్కారే కారణం

- మాజీ మంత్రి కెటిఆర్ ట్వీట్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

పొలం ఉన్న రైతులనూ పొట్టబెట్టుకుంటున్నారనీ, కౌలు తీసుకున్న కర్షకులనూ కబళిస్తున్నారనీ, ఒకే రోజు ముగ్గురు అన్నదాతలు బలికావడానికి రేవంత్ రెడ్డి సర్కారే కారణమంటూ మాజీ మంత్రి కెటిఆర్ ఆదివారం ట్వీట్ చేశారు. 'ఓవైపు సాగునీటి సంక్షోభం.. మరోవైపు రుణమాఫీ ద్రోహం. ఇంకోవైపు రైతు భరోసా మోసం.. కౌలు రైతులకూ అందని సాయం' అంటూ విమర్శించారు. రైతుకు రక్షణ వలయంగా ఉన్న పథకాలను ఒక్కొక్కటిగా ఎగ్గొట్టడంతోనే వ్యవసాయంలో ఈ విలయం నెలకొందని తెలిపారు. వందలాది మంది రైతులు పిట్టల్లా రాలిపోతున్నా ఈ ప్రభుత్వంలో చలనం లేదని విమర్శించారు. సిఎం రేవంత్‌రెడ్డికి సోయి లేదని, ప్రభుత్వానికి బాధ్యత లేదని కెటిఆర్ అన్నారు. దసరా పండుగ వేళ వ్యవసాయాన్ని దండగలా మార్చిందన్నారు. రైతన్నల చేతిలో దండన తప్పదని అన్నారు. 'అన్నదాతలారా ఆత్మస్థైర్యం కోల్పోకండి..! ముంచే రోజులు పోతాయ్.. మళ్లీ మంచి రోజులొస్తాయ్' జై కిసాన్ అంటూ వ్యాఖ్యానించారు. కాగా రైతు రుణమాఫీ ఎగ్గొట్టి, మూసీలో మురికి రాజకీయాలు చేస్తున్న మురికి దొంగ ఎవరు? రైతు బంధు ఎగ్గొట్టి, మూసీ పేదల ఉసురు పోసుకుంటున్న దుర్మార్గుడు ఎవరు? అని పోస్టు చేశారు. మహిళలకు వంద రోజుల్లోనే నెలకు రూ.2500, అవ్వ, తాతలకు నెలకు రూ.4000 ఇస్తా అని చెప్పి ఎగ్గొట్టిన నయవంచకుడు ఎవరు? అని ప్రభుత్వంపై ప్రశ్నల వర్షం కురిపించారు. మూసీ సుందరీకరణ పేరిట రూ.లక్షన్నర కోట్లు లూఠీకి తెరతీసిన ఘనుడు ఎవరు? అని ప్రశ్నించారు. ఆడబిడ్డల వేడుకకు ఏర్పాట్లు చేసేడానికి మనసురాట్లేదా? పండుగపూట కూడా పల్లెలను పరిశుభ్రంగా ఉంచలేరా? చెత్తా చెదారం మధ్య మురికి కంపులో మన ఆడబిడ్డలు బతుకమ్మ ఆడుకోవాలా? అని నిలదీశారు.

గ్రంథాలయ సంస్థలకు చైర్మన్ల నియామకం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో పలు జిల్లాల గ్రంథాలయ సంస్థలకు చైర్మన్‌లను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఆదివారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది.

నిర్మల్- సయ్యద్ అర్జుమంద్ అలీ	సిరిసిల్ల - నాగుల సత్యనారాయణ గౌడ్
కరీంనగర్- సత్తు మల్లయ్య	రంగారెడ్డి - ఎలుగంటి మధుసూధన్ రెడ్డి
వనపర్తి - జి. గోవర్ధన్	సంగారెడ్డి- గొల్ల అంజయ్య
కామారెడ్డి- మద్ది చంద్రకాంత్ రెడ్డి	నారాయణ్‌పేట్ - వరాల విజయ్ కుమార్ నాగర్
మెదక్- సుహాసిని రెడ్డి	కర్నూల్ - జి. రాజేందర్
వికారాబాద్- శేరి రాజేశ్ రెడ్డి	మహబూబ్‌నగర్- మల్లు నరసింహారెడ్డి
జోగులాంబ గద్వాల- నీలి శ్రీనివాసులు	

హైకోర్టు తీర్పు అమలు చేయకపోతే

ఒసి పనులు అడ్డుకుంటాం

- వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి వెంకట్
- హైకోర్టు తీర్పును హర్షిస్తూ నిర్వాసితుల భారీ ప్రదర్శన, విజయోత్సవ సభ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కోయగూడెం ఒసి 2 నిర్వాసితులకు హైకోర్టు తీర్పు ఇచ్చిన ప్రకారం భూమి నష్టపరిహారం, ఉద్యోగాలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైకోర్టు తీర్పును హర్షిస్తూ ఆదివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండల కేంద్రంలో నిర్వాసితులు భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట రేపాకుల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు. అటవీ హక్కుల చట్టం 2006 ప్రకారం ఏ ప్రాజెక్టు వల్లనైనా సాగు భూములు కోల్పోయిన గిరిజనులకు భూమికి భూమి, భూ నష్టపరిహారం ఇవ్వాలని, ఉపాధి కల్పించాలని ఉన్నప్పటికీ నిర్వాసితులకు ఒక్క పైసా నష్టపరిహారం, పునరావాసం చెల్లించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దాంతో వ్యవసాయ కార్మిక సంఘం, నిర్వాసితుల సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేశామని, అదేవిధంగా హైకోర్టులో న్యాయపోరాటం చేశామన్నారు. నిర్వాసితులకు న్యాయం చేయాలని కోర్టు తీర్పు ఇవ్వడాన్ని హర్షించారు. 2007లో కోయగూడెం ఒసి 2 పిట్ 2, 3 భూసేకరణ జరిగిందని, 238 హెక్టార్ల సాగు భూమిని రైతులు కోల్పోయారని, లచ్చగూడెం, కోయగూడెం, దంతెలతండా, కొత్తతండా, జేత్యతండాలకు చెందిన 101 మంది గిరిజనులు, నలుగురు గిరిజనేతరులు, మొత్తం 105 మంది ఉన్నారన్నారు. సింగరేణి సంస్థ వారి భూమికి నష్టపరిహారం, పునరావాసం ఇవ్వకుండా పంటలను ధ్వంసం చేశారన్నారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, భూ నిర్వాసితుల సంఘాల ఆధ్వర్యంలో సింగరేణి సంస్థకు వ్యతిరేకంగా ఉద్యమించినట్టు తెలిపారు. ఎకరానికి రూ.5వేలు పంట నష్టపరిహారం, హైకోర్టు తీర్పు ప్రకారం 2012లో పునరావాసం కల్పించడం జరిగిందన్నారు. భూమి నష్టపరిహారం కోసం బాధితులు మళ్ళీ 2016లో హైకోర్టును ఆశ్రయించామని తెలిపారు. ఎనిమిదేళ్ల తర్వాత హైకోర్టు తీర్పు నిర్వాసితుల పక్షాన రావడం సంతోషకరమని తెలిపారు.

బేతంపూడి పిఎసిఎస్ చైర్మన్ లక్కినేని సురేందర్ మాట్లాడుతూ.. నిర్వాసితులకు న్యాయం చేయాలన్న హైకోర్టు తీర్పును అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం వ్యకాస జిల్లా అధ్యక్షులు మచ్చా వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య, ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు దుగ్గి క్రిష్ణ మాట్లాడారు. 16 సంవత్సరాలుగా నిర్వాసితులు చేసిన పోరాటంలో న్యాయం ఉన్నందువల్లనే హైకోర్టు ఈ తీర్పు ఇచ్చిందని అన్నారు. ఐటిడిఎ పిఒ, కలెక్టర్లు హైకోర్టు తీర్పు అమలు జరిపి నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు భూక్యా రమేష్, జిల్లా కమిటీ సభ్యులు ఈసం నరసింహారావు, కడుదుల వీరన్న, పూనెం స్వామి, పూనెం చంద్రశేఖర్, దొడ్డ సంపత్ కుమార్, భూక్యా రవి, వస్రం నిర్వాసితులు పాల్గొన్నారు.

రూ.ఐదు వేల కోట్లతో ఇంటిగ్రేటెడ్ హాస్టళ్లు

- దసరాకు ముందు రోజే రాష్ట్ర వ్యాప్తంగా శంకుస్థాపనలు
- ఉప ముఖ్యమంత్రి భట్టి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

అంతర్జాతీయప్రమాణాలతో రాష్ట్రంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు నిర్మించి, పేద విద్యార్థులకు ఉచిత నాణ్యమైన విద్యను ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం అందించనుందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల కాంప్లెక్సుల అంశంపై ఆదివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొన్నం ప్రభాకర్, సీఎస్ శాంతికుమారి, పలువురు ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం భట్టి మాట్లాడుతూ రూ. ఐదువేల కోట్లతో ఈ ఏడాది ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణ పనులు ప్రారంభిస్తున్నామని తెలిపారు. దసరా పండుగకు ముందు రోజు(శుక్రవారం) రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలల నిర్మాణ పనులకు భూమి పూజ చేయనున్నట్టు ప్రకటించారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్‌స్కూళ్ల నిర్మాణం ఒక చారిత్రాత్మకమైందని చెప్పారు. ఎన్నికలకు ముందు చెప్పిన విధంగా ప్రపంచంతో పోటీపడేలా కావల్సిన నిధులు కేటాయించి విద్యపై దృష్టి పెడతామని చెప్పామని గుర్తు చేస్తూ.. ఆ మేరకు పనులు ప్రారంభిస్తున్నామని తెలిపారు. 20 నుంచి 25 ఎకరాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో ఇంటర్ వరకు విద్యనందించనున్నట్టు చెప్పారు.

కళ్యాణ మండపాలు..
అద్దెభవనాల్లో విద్యార్థుల ఇబ్బందులు..

రాష్ట్రంలో చాలా రెసిడెన్షియల్ కళాశాలలకు పక్కాభవనాలు లేవన్నారు. దీంతో కళ్యాణ మండపాలు, అద్దె భవనాల్లో ఉంటూ విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని భట్టి విక్రమార్క ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం 1023 రెసిడెన్షియల్ పాఠశాలలుండగా ఇందులో 662 పాఠశాలలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయని తెలిపారు. బీసీ వెల్ఫేర్‌లో 327 రెసిడెన్షియల్ పాఠశాలలుంటే..అందులో 306 అద్దె భవనాల్లోనే నడుస్తున్నాయని చెప్పారు. సోషల్ వెల్ఫేర్‌లో 268కిగాను 135 అద్దెభవనాల్లో ఉన్నాయన్నారు. ఎస్టీ రెసిడెన్షియల్‌లో 188లో 42 అద్దెభవనాలేనని చెప్పారు. మైనార్టీలో 205కు 135 అద్దె భవనాలేనని తెలిపారు. బలహీన వర్గాలకు ప్రాథమిక స్థాయి నుంచే నాణ్యమైన విద్య అందించాలని ఇందిరమ్మ ప్రభుత్వ నిర్ణయించిందని చెప్పారు. ఈ ఒక్క ఏడాదిలోనే తమ ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ పాఠశాలలపై రూ. ఐదు వేల కోట్లు ఖర్చు చేయబోతుందనీ, గత ప్రభుత్వం ఒక ఏడాదిలో కేవలం రూ. 73 కోట్లు మాత్రమే కేటాయించిందని గుర్తు చేశారు.

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి భటి

దసరాకు ముందు రోజే భూమి పూజ..

ఇప్పటివరకు 25 నియోజకవర్గాల నుంచి ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణానికి కావాల్సిన భూమి ఇతర వివరాలు సేకరించామని డిప్యూటీ సిఎం చెప్పారు. వాటిని పైలట్ ప్రాజెక్టుగా ప్రకటించి దసరాకు ముందు రోజే భూమి పూజ చేయనున్నట్టు ప్రకటించారు. మిగిలిన నియోజకవర్గాల నుంచి వచ్చే సమాచారం ఆధారంగా నిర్మాణాలు ప్రారంభిస్తామన్నారు. కొన్నేండ్లుగా ఆయా నియోజకవర్గాల్లో ఉండే ఉష్ణోగ్రతలు, గాలి వాటం, వాతావరణ పరిస్థితులను పరిగణలోకి తీసుకొని ఆధునిక రెసిడెన్షియల్ భవనాల నిర్మాణం జరుగుతుందని చెప్పారు. గ్రీన్ ఎనర్జీని వినియోగించుకోవటంతోపాటు అన్ని వర్గాల వారు కలిసి ఒక చోట ఓ కుటుంబంలా చదువుకునే విధంగా భవనాల నిర్మాణం జరుగుతుందన్నారు. కేవలం చదువుల పేరిట ఒత్తిడి సృష్టించే వాతావరణం కాకుండా క్రీడలు, వినోదం వంటివి విద్యార్థులకు అందిస్తామన్నారు. విద్యార్థులకు ఏ కొరత లేకుండా చూసే కార్యక్రమంలో భాగంగా థియేటర్ నిర్మించి శాటిలైట్ ద్వారా సినిమాలు సైతం ప్రదర్శించే ఆలోచనలో ఉన్నామన్నారు. పేద వర్గాల వారు వారి బిడ్డలను ఈ పాఠశాలల్లో చేర్పించి విరివిగా ప్రచారం నిర్వహించాలని కోరారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఇదో విప్లవాత్మక నిర్ణయమన్నారు. వచ్చే ఏడాది దసరా నాటికి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు అమల్లోకి తీసుకురావాలనే సంకల్పంతో ప్రభుత్వం ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

ప్రత్యామ్నాయం చూపకుండా పేదల ఇళ్లు కూల్చొద్దు

- ముందు ఫామ్ హౌస్‌లు కూల్చండి.. మేమూ సహకరిస్తాం
- కేంద్ర ప్రభుత్వ అరాచకాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలి
- కమ్యూనిస్టు అంటే లక్ష్మీదేవమ్మలా ఉండాలి : తమ్మినేని వీరభద్రం

లక్ష్మీదేవమ్మ సంస్మరణ సభలో మాట్లాడుతున్న తమ్మినేని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మూసీ సుందరీకరణ పేరుతో ప్రత్యామ్నాయం చూపకుండా పేదల ఇండ్లు కూల్చితే ఊరుకోబోమని, నిర్వాసితులతో కలిసి ఆందోళనలు చేపడతామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం హెచ్చరించారు. ఎక్కువ కాలం పరిపాలించిన కాంగ్రెస్ పాలనలోనే అక్రమ నిర్మాణాలు ఎక్కువగా జరిగాయని, ఇంటి నిర్మాణం కోసం అనుమతులు, విద్యుత్ మీటర్లకు అనుమతులు ఇచ్చిన అధికారుల సంగతేంటని ప్రశ్నించారు. సిపిఎం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నాయకులు ఎన్ఎస్ లక్ష్మీదేవమ్మ సంస్మరణ సభ ఆదివారం వనపర్తి జిల్లా కేంద్రంలోని కల్యాణ్ సాయి ఫంక్షన్ హాల్‌లో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎండి జబ్బార్ అధ్యక్షతన జరిగింది. ముందుగా ఎన్ఎస్ లక్ష్మీదేవమ్మ చిత్రపటానికి తమ్మినేనితో పాటు మాజీ ఎంపీ, పార్టీ సీనియర్ నాయకులు పి.మధు, కేంద్ర కమిటీ సభ్యులు అరుణ్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్‌వెస్లీ, రాష్ట్ర, జిల్లా పార్టీ నాయకులు, కుటుంబసభ్యులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సభలో తమ్మినేని మాట్లాడారు.

తెలంగాణ పాలకులకు చిత్తశుద్ధి ఉంటే పెద్దలు అక్రమంగా నిర్మించుకున్న ఫామ్‌హౌస్‌లు, కంపెనీలను కూల్చివేయాలని, ప్రభుత్వానికి సిపిఎం సంపూర్ణ మద్దతు ఇస్తుందని తెలిపారు. ముఖ్యంగా కూల్చివేతలకు ముందు అన్ని రాజకీయ పార్టీల వైఖరిని పరిగణనలోకి తీసుకొని ముందుకు వెళ్లాలని సూచించారు. వ్యవసాయాన్ని నిర్వీర్యం చేసే రైతు చట్టాలు, కార్మికులకు గొడ్డలిపెట్టుగా మారే కార్మిక కోడ్‌లను తెచ్చి రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తున్న బిజెపిని అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. అడవి నరికి సుందరమైన పట్టణాలను నిర్మిస్తామంటే సిపిఎం వ్యతిరేకించి తీరుతుందని హెచ్చరించారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పాక్షికంగానే అమలు చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటివరకు రెండు లక్షల రుణమాఫీ సగం మందికే అందిందని, మిగతా వారికి ఎప్పటిలోగా అమలు చేస్తారని ప్రశ్నించారు. ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిజం పని అయిపోయిందని అంటున్న వితండవాదులంతా ఒక్కసారి శ్రీలంక వైపు చూడాలన్నారు. గత ఎన్నికల్లో ముగ్గురు పార్లమెంటు అభ్యర్థులు ఉన్న ఆ దేశంలో ఈ సారి అధ్యక్ష పీఠాన్ని కైవసం చేసుకున్న విషయం గుర్తించుకోవాలన్నారు. మనదేశంలో సైతం బిజెపికి ఎదురులేదని చెప్పుకొని తిరుగుతన్న నాయకులకు.. మొన్న జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో ఇండియా కూటమి సరిగ్గా పోటీ ఇచ్చి బిజెపి దూకుడుకు కళ్లెం వేసిందని తెలిపారు. నాయకులు ఎవరైనా అనుకూల పరిస్థితుల్లో ఉద్యమాలు చేయడం కాదని, ప్రతికూల పరిస్థితుల్లోనూ మెరుగైన ఫలితాలు సాధించాలన్నారు. కుటుంబంలో, పార్టీలో, సమాజంలో ఎక్కడైనా నిజమైన నాయకులు సరియైన నిర్ణయంతో ముందుకెళ్తారని, అందుకు లక్ష్మీదేవమ్మ ఉదాహరణ అన్నారు. ఆమె ఉన్నతమైన జీవన విధానంతో పాటు ఆదర్శవంతమైన కమ్యూనిస్టుగా బతికారని గుర్తు చేశారు. ఆమె లక్ష్యాన్ని నెరవేర్చడమే ఆమెకు మనం ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు.

సిపిఎం ఉద్యమానికి లక్ష్మీదేవమ్మ చేసిన సహకారం మరువలేనివి : మాజీ ఎంపీ, సీనియర్ నాయకులు పి. మధు

మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాలో లక్ష్మి దేవమ్మ, ఆమె భర్త శ్రీహరి కమ్యూనిస్టు పార్టీ పునర్నిర్మాణంలో కీలకపాత్ర పోషించారని గుర్తు చేశారు. నాగర్ కర్నూల్ జిల్లా రంగాపూర్ గ్రామంలో భూస్వాములు జాగిర్దారులకు వ్యతిరేకంగా జరిగిన పోరాటం సందర్భంగా నాటి ప్రభుత్వం 144 సెక్షన్ విధించి కమ్యూనిస్టులను అణిచివేసే ప్రయత్నం చేసిందన్నారు. ఆ సమయంలో తాను, లక్ష్మీ దేవమ్మ.. ఆ గ్రామాలకు వెళ్లి పార్టీ సానుభూతిపరులకు, ప్రజలకు భరోసా కల్పించామని తెలిపారు. భూస్వాములకు వ్యతిరేకంగా జరుగుతున్న ప్రజా ఉద్యమ బలోపేతానికి ఆనాడు లక్ష్మీ దేవమ్మ రూ.75000 పార్టీకి విరాళంగా ఇచ్చి తన నిబద్ధతను చాటుకున్నారన్నారు. పెబ్బేరు మండలం గుమ్మడంలో ఓ మహిళ ఆకలి చావుకు గురైతే సిపిఎం చేసిన ఆందోళన ఫలితంగా కరువు ప్రాంతాలను పరిశీలించి కరువు పింఛన్లు మంజూరు చేశారని గుర్తు చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 250 అంబలి కేంద్రాలు ఏర్పాటు చేసి ఆకలి చావులను నిలువరించామని, ఈ సేవలకు నాడు లక్ష్మి దేవమ్మ మహిళా సంఘం ద్వారా చేసిన సహకారం మరువలేనిదన్నారు.

మహబూబ్‌నగర్‌లో మహిళా ఉద్యమాన్ని ముందుండి నడిపారు : కేంద్ర కమిటీ సభ్యులు అరుణ్ కుమార్

మహబూబ్‌నగర్‌లో మహిళా ఉద్యమాన్ని లక్ష్మీదేవమ్మ ముందుండి నడిపారని పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు ఆర్. అరుణ్ కుమార్ అన్నారు. లక్ష్మీ దేవమ్మ హైదరాబాద్‌లో ఉంటూ మహబూబ్‌నగర్‌లో మహిళా ఉద్యమాన్ని నడిపారని తెలిపారు. కుటుంబంలోనైనా, పార్టీలోనైనా తనకు అప్పగించిన పనిని పూర్తి చేయడంలో లక్ష్మీదేవమ్మను చూసి మనం నేర్చుకోవాలన్నారు. పుస్తక రచన ద్వారా.. ఈ సమాజంలో మనం ఎలా ఉండాలి, ఎలాంటి సమస్యల కోసం ఉద్యమించాలో మనకు నేర్పించారని తెలిపారు. ఆమె భర్త శ్రీహరి.. కొన్ని కారణాల వల్ల పార్టీ మారినా తన నిబద్ధతతో పార్టీ మారకుండా నిక్కచ్చిగా పనిచేసిన విషయం గుర్తు చేశారు. చదవడం, రాయడం, ప్రజలకు అర్థమయ్యే భాషలో చెప్పడం వంటి విషయాలు లక్ష్మీదేవమ్మకే సాధ్యమని చెప్పారు. ఈ మధ్యనే మరణించిన సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ బట్టాచార్య, లక్ష్మీదేవమ్మ మరణం పార్టీకి తీరని లోటని అన్నారు. వారు నడిచిన బాటలో నడుస్తూ ప్రజాసమస్యలపై పోరాడటమే వారికి మనమిచ్చే నిజమైన నివాళి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్, జిల్లా కార్యదర్శులు ఏ.రాములు, పర్వతాలు, కార్యదర్శి వర్గ సభ్యులు పుట్ట ఆంజనేయులు, బాల్ రెడ్డి, మండలరాజు, జిల్లా కమిటీ సభ్యులు కిల్లెగోపాల్, ఆర్ శ్రీనివాసులు, కందికొండ గీత, కురుమూర్తి, లక్ష్మీదేవమ్మ కూతురు అరుణ, కుమారులు ఉదయ్ కుమార్, అర్జున్, మనమరాలు మమత తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి స్పెషల్ రౌండ్ కౌన్సిలింగ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

టీఎస్ ఎడ్‌సెట్ - 2024 స్పెషల్ రౌండ్ కౌన్సిలింగ్‌ను ఈ నెల 7 నుంచి నిర్వహించనున్నట్టు టీఎస్ ఎడ్ సెట్-2024 అడ్మిషన్స్ కన్వీనర్ ప్రొఫెసర్ పి.రమేశ్ బాబు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఫేస్ 1, ఫేస్ 2లో రిజిస్టర్, సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేసుకోని అభ్యర్థులు ఈ దఫా రిజిస్టర్‌తో పాటు స్కాన్ చేసిన ఒరిజినల్ కాపీలను అప్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఇది వరకే రిజిస్టర్ చేసుకుని, సర్టిఫికెట్ వెరిఫికేషన్ అయిన అభ్యర్థులు నేరుగా వెబ్ ఆప్షన్లను పెట్టుకోవాలని సూచించారు.

జిజెఎల్ఎ రాష్ట్ర అధ్యక్షులుగా మదుసూధన్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గవర్నమెంట్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ (జిజెఎల్ఎ) రాష్ట్ర అధ్యక్షులుగా డాక్టర్ పి మదుసూధన్ రెడ్డి ఏకగ్రీవంగా మరోసారి ఎన్నికయ్యారు. ఆదివారం హైదరాబాద్ ఆబిడ్స్‌లోని మెథడిస్ట్ ఇంజనీరింగ్ కాలేజీలో జిజెఎల్ఎ రాష్ట్ర మూడో కౌన్సిల్ సమావేశాలు జరిగాయి. ఈ సందర్భంగా నూతన రాష్ట్ర కమిటీని సభ్యులు ఎన్నుకున్నారు. జిజెఎల్ఎ రాష్ట్ర అధ్యక్షులుగా మదుసూధన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బలరామ్ జాదవ్ (నిర్మల్), అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఈ.శ్రీనివాస్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీగా విజయశేఖర్ (సంగారెడ్డి) ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఎన్నికల అధికారులు ప్రకటించారు. ఆర్థిక కార్యదర్శిగా ఎ శివప్రసాద్, మహిళా విభాగం కార్యదర్శిగా ఎస్.పద్మావతి, ఉపాధ్యక్షులుగా సింగం శ్రీనివాస్, సత్యపాల్ రెడ్డి, జి వేణుగోపాల్, టి శ్రీధర్, ఎన్.నరేష్, వి అశోక్, స్టేట్ సెక్రటరీలుగా వి ప్రమీల, ఎవివి ప్రసాద్, ఎం హరిప్రసాద్, ఫహీముద్దీన్, జి మధు, కె శ్రీదేవి ఎన్నికయ్యారు. ఈ సమావేశానికి తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి, ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి హాజరై ప్రసంగించారు. విద్యారంగం అభివద్ధికి అధ్యాపకులు మరింత కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేశారు.

నర్సింహానందను వెంటనే అరెస్టు చేయాలి

- ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అబ్బాస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మత విద్వేష ప్రసంగాలతో ప్రజలమధ్య చిచ్చు పెడుతున్న నర్సింహానందను తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఆవాజ్ తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తున్నది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ అబ్బాస్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉత్తర ప్రదేశ్‌కు చెందిన ఆలయ పూజారీ నర్సింహానంద చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు దేశంలో ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఆయనపై ఏకంగా దేశ వ్యాప్తంగా యాభైకి పైగా కేసులు నమోదయ్యాయని తెలిపారు. గతంలో మదర్సాలను కూల్చివేయాలనీ, అలీఘఢ్ ముస్లిం యూనివర్సిటీని గన్‌పౌడర్ ఉపయోగించి పేల్చివేయాలని పిలుపునిచ్చి మతాల మధ్య చిచ్చు పెడుతున్నందుకు ఆయనపై కేసు నమోదైందని గుర్తు చేశారు. బెయిల్‌పై బయటకొచ్చి తిరిగి అదే తరహాలో మత సామరస్యాన్ని దెబ్బతీసే విధంగా ప్రసంగాలు చేస్తున్నారని విమర్శించారు. బెయిల్‌ను రద్దు చేసి, ఆయన్ను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. మతోన్మాద సంస్థల, వ్యక్తుల పట్ల కేంద్ర ప్రభుత్వ సానుకూల వైఖరి వల్లనే రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని తెలిపారు. మతోన్మాద రాజకీయాలను ప్రజలు తిరస్కరించటం ద్వారానే మతోన్మాదులకు చెక్ పెట్టగలమని పేర్కొన్నారు. మత విద్వేషాలు రెచ్చగొట్టే వారిపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలి

- గురుకుల జెఏసి డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మొత్తం గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలల్లో సుమారు 662 వరకు అద్దెభవనాల్లో నడుస్తున్నాయనీ, ఆ రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం దృష్టి సారించాలని గురుకుల జేఏసీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆదివారం జేఏసీ అధ్యక్షులు మామిడి నారాయణ, జనరల్ సెక్రటరీ డాక్టర్ మధుసూదన్, ఎస్ డబ్ల్యూ అధ్యక్షులు నరసింహులు గౌడ్ , ఎస్టీ డబ్ల్యూ జనరల్ సెక్రెటరీ గణేష్, బిక్షం యాదవ్, వేదాంతా చారి ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం వెంటనే రూ. ఐదు వేల కోట్లకు పరిపాలన ఉత్తర్వులు ఇస్తూ ఈనెల 11న 40 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒకేసారి చేపడుతున్నందున గురుకుల విద్యా వ్యవస్థ బలోపేతం అవుతుందని తెలిపారు. ఈ చర్య వల్ల విద్యార్థులు, ఉపాధ్యా యులు ఎదుర్కొంటున్న మౌలిక వసతుల సమస్య దూరమవుతుందని తెలిపారు. సమయ పాలన సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.పెరిగిన ధరలకనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలని కోరారు. గురుకుల జెఏసి, టిఎస్ యుటిఎఫ్ సంయుక్తంగా సమర్పించిన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

మైక్రో ఫైనాన్స్ వేధింపులు అరికట్టాలి

- మల్లు లక్ష్మి

మహాసభలో మాట్లాడుతున్న మల్లు లక్ష్మి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అధిక వడ్డీకి రుణాలు ఇచ్చి పేద ప్రజలను వేధింపులకు గురి చేస్తున్న బంధన్ బ్యాంక్, మైక్రో ఫైనాన్స్ లాంటి రుణ సంస్థలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి అన్నారు. ఆదివారం సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ఆర్ఎంపి భవన్‌లో నిర్వహించిన అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా 3వ మహాసభకు ఆమె హాజరయ్యారు. ముందుగా సంఘం జెండా ఆవిష్కరించి, అమరవీరులకు నివాళులు అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. బంధన్ బ్యాంకు, మైక్రో ఫైనాన్స్ లాంటి తదితర రుణ సంస్థల నుంచి జిల్లాలోని నిరుపేదలు ఆర్థిక ఇబ్బందులతో రుణాలు తీసుకున్నారన్నారు. కానీ ఆ రుణ సంస్థల యాజమాన్యాలు అధిక వడ్డీ వసూలు చేస్తూ పేద ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి రుణ సంస్థలపై జిల్లా కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. నేత కార్మికులు ప్రయివేటు బ్యాంకుల్లో తీసుకున్న రుణాలను ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పవర్‌లూమ్ కార్మికులకు ఉపాధి లభించే వరకు రుణ సంస్థలు ఇబ్బందులకు గురి చేయొద్దని సూచించారు. గ్రామాల్లో బెల్ట్ షాపులను రద్దుచేసి మహిళలకు రక్షణ కల్పించాలని కోరారు. అనంతరం మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. ఈ మహాసభలో జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా సూరం పద్మ, ప్రధాన కార్యదర్శిగా జవ్వాజి విమల, ఉపాధ్యక్షులు దేవలక్ష్మి, ఎండి రెహామాన, కల్పన, పూజ, సహాయ కార్యదర్శిగా సామల కవిత, వడ్ల లక్ష్మి, బోనాల లక్ష్మి తదితరులను ఎన్నుకున్నారు.

గాజాపై మారణ హోమాన్ని ఆపండి

- ఇజ్రాయిల్ ఏకపక్ష దాడులతో దిక్కుతోచని స్థితిలో ప్రజలు
- ఇండియాతో పాటు ప్రపంచం దన్నుగా నిలవాలి
- ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ అచిన్ వనాయక్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"గాజాపై ఇజ్రాయిల్ కొనసాగిస్తున్న మారణ హోమాన్ని వెంటనే ఆపాలి. గత ఏడాదికి పైగా సాగుతున్న భయంకరమైన మిలటరీ దాడుల వల్ల గాజా ప్రజలు దిక్కుతోచని స్థితిలో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బతుకుతున్నారు. గాజా జనాభాలో ఎనిమిది శాతం మంది ప్రజలు యుద్ధం వల్ల నష్ట పోయారు. కొందరు మరణిస్తే, మరికొందరు ఆచూకి లేకుండా పోయారు. క్షతగాత్రుల సంఖ్య లెక్కంచలేకుండా ఉంది. ఇండియా, అరబ్ దేశాలతో పాటు ప్రపంచం పాలస్తీనియన్లకు అండగా నిలవాలి" అని ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్, రచయిత అచిన్ వనాయక్ అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో " మానవ హక్కుల నేత ప్రొఫెసర్ బాలగోపాల్ 15వ స్మారక లెక్చర్"లో ఆయన ముఖ్యవక్తగా పాల్గొని ప్రసంగించారు. ప్రపంచంలోనే అత్యంత కౄరమైన, అనాగరిక మిలటరీ వ్యవస్థను కలిగి ఉన్న ఇజ్రాయిల్ పాలస్తీనియన్ల హక్కులను కాలరాస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతీ దేశానికి ఒక జాతీయత ఉంటుంది. కానీ ఇజ్రాయిల్‌కు మాత్రం ఆ దేశం యొక్క మిలటరీనే జాతీయత అని ఎద్దేవా చేశారు. ఆయుధ సంపదతో చైనా, భారత్, గల్ఫ్ తదితర దేశాలను తన గుప్పిట్లో పెట్టుకుని పాలస్తీనాతో పాటు పలు పశ్చిమాసియా దేశాలపై మిలటరీ దాడులకు పాల్పడుతున్నదని అన్నారు. పాలస్తీనా భూ బాగాన్ని అక్రమించుకుని ఆ దేశ ప్రజలపై చేస్తున్న దారుణాలకు అంతులేకుండా పోయిందని పేర్కొన్నారు. గాజా వీధులు నిత్యం రక్తంతో తడుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పాలస్తీనా వాసులు స్వేచ్ఛ కోసం చేస్తున్న పోరాటాలను హమాస్‌తో ముడిపెట్టి వారిపై పైశాచిక దాడులకు తెగబడుతోందని గుర్తు చేశారు. ప్రపంచం ముందు వారిని ఇస్లామిక్ తీవ్రవాదులుగా ముద్రవేసేందుకు కుట్రలు పన్నుతున్నదని ఆరోపించారు. అనంతరం ప్రజా ఉద్యమాలను గుర్తించడంలో విచిత్ర పరిస్థితి అనే అంశంపై హక్కుల కార్యకర్త తాషి చౌడప్ ప్రసంగించారు. అంతకు ముందు మానవ హక్కుల వేదిక నాయకులు బాగవతుల రాజు బాలగోపాల్ ఉద్యమ నేపథ్యాన్ని వివరించారు. తెలుగు నేలపై మానవ హక్కుల హరణ, ఎన్‌కౌంటర్లు, దళితులపై దాడులకు వ్యతిరేకంగా ఆయన నిబద్ధతతో పోరాడారని కొనియాడారు. "అసమానతలు ఉన్నంత వరకు పోరాటం ఉంటుంది. ఆ క్రమంలో రాజ్యం అణచివేతలకు పాల్పడుతుంది. గిరిజనులు, మహిళలు, ఆదివాసీలు, దళితులు బడుగు బలహీన వర్గాలు బాధితులుగా మారుతారు" అని బలంగా నమ్మిన ఆయన చివరి వరకు వారి కోసం పోరాడారని అన్నారు. బాలగోపాల్ తన జీవిత కాలంలో రాసిన వ్యాసాలు, కోర్టు కేసులు, ఇతర లెక్చర్లతో మానవ హక్కుల వేదిక ప్రచురించిన ఎస్సీవర్గీకరణ -ప్రజాస్వామిక దృక్పదం, స్త్రీల కోసం-బతుకు కోసం, సిటిజన్ రిపోర్ట్ సెక్యూరిటీ-అన్ సెక్యూరిటీ పుస్తకాలను సమావేశంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ హరగోపాల్, పాలమూరు అధ్యయన వేదిక అధ్యక్షులు రాఘవాచారి, సీనియర్ సంపాదకులు రామచంద్ర మూర్తి, వసంత కన్నాభిరన్, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

కెసిఆర్ ఎక్కడ.. వెతికి పెట్టండి!

- గజ్వేల్ పోలీస్ స్టేషన్‌లో కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదు
- నియోజకవర్గంలో ఎక్కడికక్కడే ఆగిన పనులు

పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న గజ్వేల్ నియోజకవర్గ ప్రజలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గజ్వేల్ నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన మాజీ సిఎం, గజ్వేల్ ఎమ్మెల్యే కెసిఆర్.. నియోజకవర్గ ప్రజలకు కనిపించడం లేదని, వెతికి పెట్టాలని స్థానిక పోలీస్ స్టేషన్‌లో .పిసిసి అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్ రావు, పిసిసి ప్రధాన కార్యదర్శి నాయిని యాదగిరి తదితరులు ఫిర్యాదు చేశారు. సిద్ధిపేట జిల్లా గజ్వేల్ పోలీస్ స్టేషన్‌లో సిఐ సైదాకు వారు ఆదివారం లిఖితపూర్వకంగా ఫిర్యాదు ఇచ్చారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ సమీపంలో వారు మీడియాతో మాట్లాడుతూ.. గజ్వేల్ అసెంబ్లీ స్థానం నుంచి మూడుసార్లు గెలిపించి అసెంబ్లీకి పంపించామని, అయినా ప్రజలకు ఒరగబెట్టిందేమీ లేదన్నారు. కనీసం ప్రజల కన్నా కనిపిస్తే బాగుంటుందని తెలిపారు. శాసనసభ పక్ష నేతగా కాంగ్రెస్ ప్రభుత్వానికి సూచనలు, సలహాలు ఇవ్వాల్సింది పోయి వ్యవసాయక్షేత్రంలో తలదాచు కుంటున్నారని విమర్శించారు. నియోజకవర్గంలో అనేక సమస్యలతో ప్రజలు కొట్టుమిట్టాడుతున్నారని వాటిని పరిష్క రించడానికి ఎమ్మెల్యే బయటకు రావాలని కోరారు.

ఎక్కడి పనులు అక్కడే

గజ్వేల్ నియోజకవర్గంలో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయని తెలిపారు. పేదలకు సంబంధించిన షాదీ ముబారక్, కల్యాణ లక్ష్మి చెక్కులు 900 వరకు పెండింగ్‌లో ఉన్నాయని, ఎమ్మెల్యే రాకపోవడంతో పంపిణీ కాకుండా సంబంధిత శాఖ అధికారులు తమ దగ్గర పెట్టుకున్నారన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం స్థానిక ఎమ్మెల్యే ద్వారానే వీటిని ప్రజలకు అందించాల్సి ఉంటుందని అధికారులు అంటున్నారని తెలిపారు. కెసిఆర్ ఫామ్‌హౌస్ విడిచి బయటకు రావడం లేదని, కెసిఆర్ అసలు ఎక్కడున్నారని ప్రశ్నిస్తున్నారు. స్థానిక పోలీసులు వెతికి గజ్వేల్ ప్రజలకు సమాచారం ఇవ్వాలని, ఒకవేళ పోలీసులకు చిక్కకపోతే తామే వెతికి ప్రజలకు అప్పగిస్తామన్నారు.

పట్టణంలో 23 కిలోమీటర్ల రింగ్ రోడ్డు ఇంకా పూర్తి కాలేదని చెప్పారు. స్థానిక కోట మైసమ్మ రోడ్డు అర్ధాంతంగా నిలిచిపోయిందని, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇంకా పంపిణీ కాలేదని అన్నారు. ఇటు ప్రజల్లోగాని, అటు పత్రికల్లో గాని కెసిఆర్ కనిపించకపోవడంతో నియోజకవర్గ ప్రజలు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. మూడోసారి గెలిచిన కెసిఆర్.. గజ్వేల్ ప్రజలకు ముఖం చూపించడం లేదని, 28 సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకొని అందమైన భవనం నిర్మించుకున్న ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి ఆయన రాకపోవడం విచారకరమన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించాలని అధికారుల వద్దకు వెళ్తే ఎమ్మెల్యే ద్వారా ప్రతిపాదనలు రావాలని అధికారులు చెబుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మండల అధ్యక్షులు మల్లారెడ్డి, నాయకులు గోపాల్ రావు, వివిధ మండలాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'రాజీవ్ స్వగృహ'.. ఫర్ సేల్

- మిగిలిన ప్లాట్లు, ఖాళీ స్థలాల అమ్మకం
- అసంపూర్తి ఇళ్లు ఉన్నవి ఉన్నట్టుగానే విక్రయం
- త్వరలో సర్కార్ కొత్త ధరలు నిర్ణయించే ఛాన్స్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాజీవ్ స్వగృహలో మిగిలిపోయిన ప్లాట్లు, ఖాళీ స్థలాలను విక్రయించాలని సర్కార్ భావిస్తోంది. అసంపూర్తిగా ఉన్న ఇండ్లను సైతం ఉన్నవి ఉన్నట్టుగా అమ్మకానికి పెట్టనున్నారు. అలాగే గతంలో అమ్ముడుపోగా అసంపూర్తిగా మిగిలి ఉన్న ఇండ్లతోపాటు, మరిన్ని ఇళ్ల నిర్మాణం కోసం కేటాయించిన భూములను కూడా అమ్మి నిధులను సమీకరించుకోవాలనే ఆలోచనతో సర్కార్ ఉంది. ఇందుకోసం ప్లాట్లకు ధరలను నిర్ణయించేందుకు గతంలో వేసిన కమిటీ ఆయా ఇళ్ల పరిస్థితి, అక్కడి మార్కెట్ డిమాండ్ ఆధారంగా ధరలను సిఫార్సు చేస్తూ ఇటీవలే ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. దీన్ని పరిశీలిస్తున్న ప్రభుత్వం మరికొద్ది రోజుల్లో అధికారికంగా ధరలను వెల్లడించి లాటరీ లేదా వేలం పద్ధతిలో ఇళ్లను విక్రయించాలనే ఆలోచన చేస్తోంది. ఇలా ఇళ్లు, ఖాళీ స్థలాలను అమ్మగా వచ్చే నిధులను సగం కట్టి మిగిలిపోయిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, కొత్తగా ప్రభుత్వం నిర్మించనున్న ఇందిరమ్మ ఇళ్లకు వినియోగించేందుకు ప్రభుత్వం ప్లానింగ్ చేస్తున్నట్టు సమాచారం. సర్కార్ నిర్ణయం వెలువడిన వెంటనే విక్రయానికి సంబంధిత అధికారులు ఏర్పాట్లు చేయనున్నట్టు తెలుస్తోంది.

కాగా ఇటీవల సిఎం రేవంత్‌రెడ్డి గృహ నిర్మాణశాఖపై సచివాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలోనూ రాజీవ్ స్వగృహ ఇళ్ల అంశం ప్రస్తావించారు. నిరుపయోగంగా ఉన్న ఇళ్లను వేలం వేయాలనీ, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు ఎంపికైన వారికి ఈ ఇండ్లను అప్పగించాలని సూచించారు. అలాగే నగరంలో నిర్మించి నిరుపయోగంగా ఉన్న రాజీవ్ స్వగృహ బ్లాక్‌లకు మౌలిక వసతులు కల్పించి అర్హులైన వారికి అప్పగించాలని సంబంధిత అధికారులకు సూచించారు.

జిల్లాలో ఇళ్లు, స్థలాలు ఇలా..

ప్రస్తుతం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని పోచారం, నాగోలు సమీపంలోని బండ్లగూడ, గాజుల రామారం, జవహర్‌నగర్‌లో ఇళ్లు ఉన్నాయి. నిర్మాణాలు చేపట్టకుండా ఉన్న ఖాళీ భూములు సైతం 135 ఎకరాల వరకు ఉన్నాయి. ఇక ప్రస్తుతం చిన్న చిన్న పనులు, మరమ్మతులు మినహా మిగతా మొత్తం ఉన్న ఇండ్లు నాగోలు సమీపంలోని బండ్లగూడ, ఘట్‌కేసర్ పరిధిలోని పోచారంలో మాత్రమే ఉన్నాయి. సింగిల్ బెడ్‌రూమ్ ప్లాట్లు బండ్లగూడలో 105, పోచారంలో 255 ఉన్నాయి. డబుల్ బెడ్‌రూమ్ ప్లాట్లు బండ్లగూడలో 19, పోచారంలో 340 ఉన్నాయి. త్రిబుల్ బెడ్‌రూమ్ ప్లాట్లు బండ్లగూడలో 08, పోచారంలో 04 ఉన్నాయి. సీనియర్ సిటిజన్స్ ప్లాట్లు బండ్లగూడలో 24 సిద్ధంగా ఉన్నాయి. ఇలా బండ్లగూడలో మొత్తం 160 వరకు ప్లాట్లు, పోచారం టౌన్‌షిప్‌లో మొత్తం 600 వరకు ప్లాట్లు, దాదాపు 1300 వరకు ఓపెన్ ప్లాట్లు, 350 వరకు ఇండ్లు అమ్ముడు పోలేదు. గాజుల రామారంలో 408 ప్లాట్లు అసంపూర్తిగా ఉన్నాయి. ఒక్కొక్కటి ఎనిమిది అంతస్తులుగా ఉన్న ఐదు టవర్లు ఇక్కడ ఉన్నాయి. వీటిలో మూడు బిహెచ్‌కె ప్లాట్ల టవర్లు 3, 2 బిహెచ్‌కె ప్లాట్ల టవర్లు రెండు ఉన్నాయి. పోచారంలో పూర్తయిన ఇండ్లలో జీ ప్లస్ తొమ్మిది అంతస్తులతో కూడిన 19 టవర్లుంటే.. వీటిలో చాలా పనులు చేసుకోవాల్సిన అసంపూర్తి ఇండ్ల టవర్లు ఎనిమిది ఉన్నాయి. గతేడాది రెండు టవర్లను అమ్మగా ఇంకా ఆరు మిగిలి ఉన్నాయి. వీటిలో పైకప్పులు నిర్మించినవి 376 ఉన్నాయి. మిగతా టవర్లలో పైకప్పులు నిర్మిస్తే మొత్తం 694 ప్లాట్లు అందుబాటులోకి వస్తాయి. టవర్ల మధ్యలో 19 ఎకరాల ఖాళీ స్థలం కూడా ఉంది.

గతేడాది ధరలు ఇలా..

ఆయా ప్రాంతాల్లో భూమి ధర, ఇళ్ల ధరను ప్రస్తుత కండిషన్ ఆధారంగా చూస్తే చదరపు అడుగు ధరను నిర్ణయిస్తూ కమిటీ సభ్యులు ప్రభుత్వానికి సిఫార్సు చేశారు. దీనిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుని అధికారికంగా ధరను ఖరారు చేసిన తర్వాత ఇళ్ల అమ్మకపు ప్రకటన వెలువడనుంది. కాగా గతంలో వైఎస్ హయాంలో నిర్మించిన ఇళ్లు, ప్లాట్లు చాలా నిరుపయోగంగా ఉన్నాయి. ఈ ఇండ్లకు ఇప్పటికే ఆరుసార్లు వేలం వేయగా.. చాలా పాట్లు, ఖాళీ ప్లాట్లు అమ్ముడుపోకుండా మిగిలిపోయాయి. గతేడాది పోచారంలో చదరపు అడుగు ధర రూ.1,600 వరకు ఖరారు చేశారు. వాటిని కొన్నవారు చదరపు అడుగుకు రూ.1000 ఖర్చు చేసి ప్రయివేటు బిల్డర్లతో ఇండ్లను సిద్ధం చేసుకున్నారు. వెరసి ఒక్కో ప్లాట్ చదరపు అడుగు ధర దాదాపు రూ. మూడు వేలు పలికినట్టు అయ్యింది. ఆ ప్రాంతంలో ప్రయివేట్ నిర్మాణదారులు చదరపు అడుగును రూ.5 వేల వరకు అమ్ముతున్నారు. ఇక గాజులరామారంలో చదరపు అడుగును రూ.1,600 చొప్పున కొనుగోలు చేయగా, చదరపు అడుగుకు రూ. 1,100 చొప్పున ఖర్చు చేశారు. ప్రస్తుతం అక్కడ చదరపు అడుగుకు ధర రూ. ఆరు వేలకు పైగా పలుకుతోంది. మిగిలిన ప్లాట్లను పాత ధరలకు 5-10 శాతం వరకు పెంచి విక్రయిస్తారా..? లేదా బిల్డర్ రేట్లకే విక్రయిస్తారా..? అనేది త్వరలోనే తెలియనుంది.

పిడుగుపాటుకు ఇద్దరు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పిడుగుపాటుకు ఇద్దరు మృతిచెందిన సంఘటన హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం వెంకటాపూర్ గ్రామంలో ఆదివారం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. వెంకటాపూర్ గ్రామానికి చెందిన యువతి దౌత్ బాజీ శ్రావణి (17), యువరైతు కూకట్ల రాజు (25) వారి వ్యవసాయ క్షేత్రం వద్ద ఆదివారం పనులు చేస్తున్నారు. ఈ క్రమంలో ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడటంతో పిడుగులు పడ్డాయి. పనిచేస్తున్న ప్రదేశంలో వారిపై పిడుగుపడటంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందినట్టు గ్రామస్తులు తెలిపారు. వారి మృతితో గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది.

లారీ ఢీకొని భవన నిర్మాణ కార్మికుడు దుర్మరణం

- మరొకరికి గాయాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బైక్‌పై వెళ్తున్న ఇద్దరు భవన నిర్మాణ కార్మికులను వేగంగా వచ్చిన లారీ ఢీ కొట్టడంతో.. ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరు గాయపడ్డారు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ పరిధిలోని మైలార్‌దేవ్‌పల్లి పోలీసుస్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణపేట జిల్లా మండలం ధన్వాడ గ్రామానికి చెందిన కిష్టాపురం రాజు (36) బతుకుతెరువు కోసం రాజేంద్రనగర్ ప్రాంతానికి కొంతకాలం క్రితం వలస వచ్చాడు. రాజు స్థానికంగా భవన నిర్మాణ కార్మికునిగా పని చేస్తున్నాడు. అయితే ఆదివారం ఉదయం పని నిమిత్తం రాజు తన స్నేహితుడైన రమేష్‌తో కలిసి బైక్‌పై ఆరాంగర్ నుంచి దుర్గానగర్ వైపు వెళ్తున్నారు. దుర్గానగర్ దగ్గర లారీ అతివేగంగా వచ్చి నిర్లక్ష్యంగా రాజు బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న ఇద్దరూ కింద పడిపోయారు. రాజు తలకు బలమైన గాయాలు కావడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. రమేష్‌కు గాయాలు కావడంతో స్థానికులు అతన్ని సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. లారీ డ్రైవర్ ప్రభాకర్‌రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా, మృతిచెందిన భవన నిర్మాణ కార్మికుడు రాజు.. కుటుంబానికి ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చేంతవరకు వారికి అండగా ఉంటామని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు రుద్రకుమార్ తెలిపారు. విషయం తెలుసుకున్న వెంటనే ఘటనాస్థలికి వెళ్లి పరిశీలించారు. అనంతరం మృతుని భార్య భారతమ్మను పరామర్శించారు. కార్మికుని కుటుంబానికి నష్టపరిహారం ఇప్పించేంత వరకూ సీఐటీయూ పోరాటం చేస్తుందని భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించిన వారిలో భవన నిర్మాణ రంగం నాయకులు స్వామి, వెంకటేష్, చాంద్ పాషా, రాజు ఉన్నారు.